సాక్షి ఖమ్మం
సోమవారం । 16 । జూన్ । 2025



..పనులు ముందుకు సాగేనా?

వరదల నుంచి రక్షణ కోసం మున్నేరుకు ఇరు వైపులా చేపట్టిన పనులు భూసేకరణ సమస్యతో ఒకవైపు ముందుకు సాగడం లేదు. 8లో



విత్తనాలు సిద్ధం..

వానాకాలం సీజన్ ప్రారంభం కావడంతో వరి, ఇతర విత్తనాలను అందుబాటులో ఉంచేలా అధికారులు రంగం సిద్ధం చేస్తున్నారు. 8లో

గరిష్టం / కనిష్టం
33° / 26°

వాతావరణం

జిల్లాలో సోమవారం సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. కొన్ని ప్రాంతాల్లో ఆకాశం మేఘావృతమై జల్లులు పడే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్‌

భట్టికి మంత్రి తుమ్మల శుభాకాంక్షలు



డిప్యూటీ సీఎం భట్టిని సత్కరిస్తున్న తుమ్మల నాగేశ్వరరావు

ఖమ్మంమయూరిసెంటర్‌ : రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కకు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు జన్మదిన శుభకాంక్షలు తెలిపారు. ఆదివారం హైదరాబాద్‌లోని జ్యోతిరావు పూలే ప్రజాభవన్‌లో భట్టిని కలిసిన తుమ్మల శాలువాతో సత్కరించారు.

జిల్లాలో నేడు మంత్రి పొంగులేటి పర్యటన

ఖమ్మంమయూరిసెంటర్‌/నేలకొండపల్లి : రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సోమవారం జిల్లాలో పర్యటించనున్నారు. ఉదయం 9 గంటలకు నేలకొండపల్లి మండలం గువ్వలగూడెంలో సీసీ రోడ్డు పనులకు, 9.30 గంటలకు కొరట్లగూడెం, 10 గంటలకు మోటాపురంలో బీటీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తారు. 10.30 గంటలకు మోటాపురం నుంచి బయలుదేరి హైదరాబాద్‌ వెళతారు. కాగా, పొంగులేటి పర్యటన వివరాలను నేలకొండపల్లి మార్కెట్‌ కమిటీ చైర్మన్‌ వెన్నపూసల సీతారాములు ఆదివారం విలేకరులకు వెల్లడించారు. ఆయన వెంట నాయకులు శాఖమూరి రమేష్‌, కడియాల నరేష్‌, బచ్చలకూరి నాగరాజు, రావెళ్ల కృష్ణారావు ఉన్నారు.

క్రీడా పాఠశాలల్లో ప్రవేశాలకు ఎంపిక పోటీలు

ఖమ్మం సహకారనగర్‌: తెలంగాణ స్పోర్ట్స్‌ అథారిటీ పరిధి ప్రభుత్వ క్రీడా పాఠశాలల్లో 2025 –26 విద్యాసంవత్సరానికి నాలుగో తరగతిలో ప్రవేశాలకు ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు ఖమ్మం అర్బన్‌ ఎంఈఓ శైలజాలక్ష్మి ప్రకటనలో తెలిపారు. హకీంపేట, కరీంనగర్‌, ఆదిలాబాద్‌లోని స్పోర్ట్స్‌ స్కూళ్లలో ప్రవేశానికి మూడంచెల్లో పోటీలు ఉంటాయని వెల్లడించారు. ఈనెల 16 నుండి 19వ తేదీ వరకు మండల స్థాయిలో, ఇక్కడ ప్రతిభ చూపిన వారికి ఈనెల 23 నుండి 26 వరకు జిల్లా స్థాయి పోటీలు, ఆ తర్వాత జూలై 1నుండి 5వరకు రాష్ట్ర స్థాయి పోటీలు నిర్వహించి అర్హులను ఎంపిక చేస్తారని తెలిపారు. 01-09-2016 నుండి 30-8- 2017 మధ్య జన్మించిన వారు అర్హులు కాగా, వివరాలకు tgss.telangana.gov.inలో పరిశీలించాలని సూచించారు.

నేడు గిరిజన దర్బార్‌

భద్రాచలంటౌన్‌: భద్రాచలం ఐటీడీఏ కార్యాలయంలో సోమవారం నిర్వహించనున్న గిరిజన దర్బార్‌ కార్యక్రమానికి అన్ని శాఖల అధికారులు సకాలంలో హాజరుకావాలని ఐటీడీఏ పీఓ బి.రాహుల్‌ ఆదివారం ఒక ప్రకటనలో ఆదేశించారు. ఉదయం 10.30 గంటలకు ప్రారంభమయ్యే గిరిజన దర్బార్‌లో ఆదివాసీ గిరిజనలు తమ సమస్యలకు సంబంధించిన అంశాలపై లిఖితపూర్వకంగా ఫిర్యాదును అందజేయాలని పేర్కొన్నారు.

స్థానిక సందడి..



- మంత్రి పొంగులేటి ప్రకటనతో కేడర్‌లో కదలిక
- ఇటీవలే తుమ్మల కూడా కార్యకర్తలకు దిశానిర్దేశం
- గ్రామాల్లో మొదలైన ఆశావహుల హడావిడి
- ఏకగ్రీవాలపై అధికార పార్టీ ఫోకస్‌

సాక్షిప్రతినిధి, ఖమ్మం : జిల్లాలో మళ్లీ స్థానిక సంస్థల ఎన్నికల సందడి మొదలైంది. కొన్ని నెలలుగా ఎలాంటి హడావిడి లేకున్నా.. గ్రామ పంచాయతీ, మండల, జిల్లా పరిషత్‌లతో పాటు మున్సిపల్‌ ఎన్నికలు త్వరలోనే జరుగుతాయనే సంకేతాలతో ఆశావహులు రంగంలోకి దిగారు. రాష్ట్ర రెవెన్యూ, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆదివారం కూసుమంచిలో కార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో ఎన్నికలపై ప్రకటన చేశారు. సోమవారం జరిగే కేబినెట్‌ భేటీలో తేదీలపై స్పష్టత వస్తుందని కూడా చెప్పారు. ఎన్నికలకు సిద్ధంగా ఉండాలని కేడర్‌కు పిలుపునిచ్చారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మరో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సైతం నియోజకవర్గాల వారీగా కార్యకర్తలతో సమావేశాలు నిర్వహించి దిశానిర్దేశం చేస్తున్నారు. ఇక స్థానికంగా టికెట్లు ఆశిస్తున్న నేతలు కార్యకర్తలను సమన్వయం చేసే పనిలో పడ్డారు. ఇదిలా ఉండగా.. గ్రామాల్లో అభివృద్ధి జరగాలంటే గ్రామ పంచాయతీలను ఏకగ్రీవం చేసి కలిసికట్టుగా వెళ్లేందుకు చర్యలు చేపట్టాలని అధికార పార్టీ తమ నాయకులకు సూచిస్తోంది.

ఏడాదిగా ప్రత్యేక పాలన..

జిల్లాలో మొత్తం 589 గ్రామ పంచాయతీలు ఉండగా.. 2019లో 584 గ్రామ పంచాయతీలకు ఎన్నికలు జరిగాయి. ఆ ఏడాది ఫిబ్రవరి 2న పంచాయతీ పాలకవర్గాలు పగ్గాలు చేపట్టాయి. వాటి గడువు 2024 ఫిబ్రవరి ఒకటిన ముగిసింది. అప్పటి నుంచి గ్రామ పంచాయతీల్లో ప్రత్యేకాధికారుల పాలన కొనసాగుతోంది. పల్లెల్లో దాదాపు 16 నెలలుగా ఇన్‌చార్జ్‌లే దిక్కయ్యారు. గ్రామ పంచాయతీ పాలకవర్గాలు లేక ప్రజలు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారు. ప్రస్తుతం వర్షాకాలం ప్రారంభం కావడంతో సీజనల్‌ వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉంది. కొన్ని గ్రామాల్లో పారిశుద్ధ్యం అధ్వానంగా తయారైంది. ఇన్‌చార్జ్‌లుగా నియమితులైన అధికారులు ఇతర పనులతో సతమతం అవుతుండడంతో స్థానిక పాలనపై దృష్టి సారించలేకపోతున్నారు.

సమస్యలతో వాయిదాలు..

స్థానిక సంస్థల ఎన్నికలకు పలు అడ్డంకులు ఎదురయ్యాయి. గతంలోనే ఎన్నికలు పూర్తి చేయాలని ప్రభుత్వం, ఎన్నికల సంఘం నిర్ణయించాయి. ఓటర్ల జాబితా, బ్యాలెట్‌ బాక్స్‌లు సిద్ధం చేశాయి. ఎన్నికలు ఎప్పుడొచ్చినా సిద్ధంగా ఉండాలని అధికారులను ఈసీ ఆదేశించింది. అయితే కులగణన తదితర సమస్యలతో వాయిదా పడుతూ వచ్చింది. జిల్లాలో ఎన్నికలు ఎప్పుడు నిర్వహించినా సిద్ధంగా ఉండేందుకు 3,148 బ్యాలెట్‌ బాక్స్‌లను అందుబాటులో ఉంచారు. బ్యాలెట్‌ పేపర్ల ముద్రణ కూడా పూర్తిచేశారు. అయితే ఆ తర్వాత ఎన్నికల నిర్వహణపై ప్రభుత్వం నిర్ణయం తీసుకోలేదు.

మరోసారి సమాయత్తం..

స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు ప్రభుత్వం మరోసారి కసరత్తు ప్రారంభించింది. త్వరలోనే ఎన్నికలు జరుగుతాయని మూడు రోజుల క్రితం మంత్రి సీతక్క, ఆదివారం మరో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రకటించారు. దీంతో రాజకీయ పార్టీల్లో కదలిక వచ్చింది. ప్రధానంగా అధికార కాంగ్రెస్‌ పార్టీలోని ఆశావహులు కార్యరంగంలోకి దూకారు. ఇప్పటి నుంచే గ్రామాల్లో ఇంటింటినీ సందర్శిస్తున్నారు. ఈసారి ఎలాగైనా స్థానికంగా తమ పట్టు నిరూపించుకోవాలనే లక్ష్యంతో కొందరు నేతలు పనిచేస్తున్నారు. మరోవైపు జిల్లాకు చెందిన ముగ్గు రు మంత్రులు కూడా కార్యకర్తలను ఎన్నికలకు సిద్ధం చేస్తున్నారు. స్థానిక ఎన్నికల్లో సత్తా చాటేలా ప్రణాళికలు రూపొందించాలని సూచిస్తున్నారు.

ఏకగ్రీవాలపై దృష్టి..

జిల్లాలో మొత్తం 589 గ్రామ పంచాయతీలు ఉండగా.. 12 పంచాయతీలు ఏదులాపురం మున్సిపాలిటీలో విలీనం అయ్యాయి. ప్రస్తుతం జిల్లాలో 577 గ్రామపంచాయతీలు ఉన్నాయి. కేంద్ర ఎన్నికల సంఘం ఈ పంచాయతీలకు ఎన్నికలు నిర్వహించాల్సి ఉంది. అయితే వీటిలో ఎక్కువ పాలకవర్గాలను ఏకగ్రీవంగా ఎన్నుకునేందుకు అధికార కాంగ్రెస్‌ పార్టీ పావులు కదుపుతోంది. ఈ మేరకు ఇప్పటి నుంచే మంత్రులు, నేతలు.. స్థానిక నాయకులకు సూచనలు చేస్తున్నారు. ఎక్కువ పంచాయతీలను ఏకగ్రీవం చేసుకుంటే ఆయా గ్రామాల్లో అభివృద్ధి బాగా జరుగుతుందని చెబుతున్నారు. మూడు రోజుల క్రితం మంత్రి తుమ్మల నాగేశ్వరరావు రఘునాథపాలెం మండల స్థాయి కార్యకర్తల సమావేశంలో, మరో మంత్రి పొంగులేటి ఆదివారం కూసుమంచిలో జరిగిన పాలేరు నియోజకవర్గస్థాయి ముఖ్య నేతల సమావేశంలోనూ ఇదే విషయమై సూచనలు చేశారు.

జిల్లాలో మొత్తం ఓటర్లు	మహిళలు	పురుషులు	ఇతరులు	పోలింగ్‌ కేంద్రాలు	సిద్ధంగా ఉన్న బ్యాలెట్‌బాక్స్‌లు
8,64,702	4,46,527	4,18,151	24	5,438	3,148

కిన్నెరసానిలో పర్యాటక సందడి

పాల్వంచరూరల్‌: కిన్నెరసానిలో ఆదివారం పర్యాటకులు ప్రకృతి అందాలను తిలకించి సందడి చేశారు. మండల పరిధిలోని కిన్నెరసానికి ఆదివారం రాష్ట్రంలోని పలు ప్రాంతాల నుంచి పర్యాటకులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. డ్యామ్‌, జలాశయం, డీర్‌ పార్కులోని దుప్పులను వీక్షించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ప్రకృతి అందాల నడుమ ఉత్సాహంగా గడిపారు.

599 మంది పర్యాటకులు కిన్నెరసానిలోకి ప్రవేశించగా వైల్డ్‌లైఫ్‌ శాఖకు రూ.33,145 ఆదాయం లభించింది. 400 మంది బోటు షికారు చేయగా టూరిజం కార్పొరేషన్‌ సంస్థకు రూ.22,000 ఆదాయం లభించినట్లు నిర్వాహకులు తెలిపారు.



కిన్నెరసాని జలాశయంలో బోటు షికారు చేస్తున్న పర్యాటకులు

కేంద్ర పథకాలు సద్వినియోగం చేసుకోవాలి

భద్రాచలంటౌన్‌: గిరిజనులు కేంద్ర ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఐటీడీఏ పీఓ బి.రాహుల్‌ సూచించారు. ఈ నెల 16 నుంచి 30వ తేదీ వరకు ధర్తీ ఆబాజన్‌ జాతీయ గ్రామ్‌ ఉత్కర్ష అభియాన్‌ శ్యాచురేషన్‌ క్యాంపులు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఐటీడీఏ పరిధిలోని 19 మండలాల్లో ఈ క్యాంపులు నిర్వహిస్తామని, వీటిలో ఆధార్‌, కుల ధ్రువీకరణ, ఓటర్‌ గుర్తింపు, రేషన్‌, కిసాన్‌ క్రెడిట్‌ కార్డులు, ఆయుష్మాన్‌ భారత్‌, ఆర్‌ఓఎఫ్‌ఆర్‌ పట్టాలు, జన్‌ధన్‌, ఎన్‌ఆర్‌ఈజీఎస్‌ కార్డులను అర్హులకు అందిస్తారని వివరించారు. ప్రత్యేకాధికారులు, ఎంపీడీఓలు, పంచాయతీ కార్యదర్శులు అవగాహన సదస్సులు నిర్వహించి దరఖాస్తులు స్వీకరించాలని ఆదేశించారు.

మతం పేరుతో కల్లోలం సృష్టిస్తున్నారు



బచ్చోడులో జరిగిన ర్యాలీలో మంత్రి పొంగులేటి, నాయకులు

- బీజేపీకి తగిన గుణపాఠం చెప్పాలి
- రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి
- బచ్చోడులో 'జై బాపు..జై భీమ్‌.. జై సంవిధాన్‌' కార్యక్రమం

తిరుమలాయపాలెం: మతాన్ని అడ్డుపెట్టుకుని కేంద్రంలో మూడుసార్లు అధికారంలోకి వచ్చిన బీజేపీ.. దేశంలో అల్లకల్లోలం సృష్టిస్తోందని, అలాంటి ప్రభుత్వానికి గుణపాఠం చెప్పాలని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్‌ శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. మండలంలోని బచ్చోడులో ఆదివారం నిర్వహించిన జై బాపు.. జై భీమ్‌.. జై సంవిధాన్‌ ర్యాలీకి ఆయన హాజరై మాట్లాడారు. దేశ స్వాతంత్య్రం కోసం పోరాడిన మహనీయుల జ్ఞాపకాలను, అంబేద్కర్‌ రాసిన రాజ్యాంగాన్ని బీజేపీ అపహాస్యం చేస్తోందని ఆరోపించారు. ఆ రాజ్యాంగం లేకుంటే ప్రజలకు ఇప్పుడు మాట్లాడే స్వేచ్ఛ కూడా ఉండేది కాదన్నారు. అధికారం కోసం బీజేపీ ప్రాంతాలు, మతాల మధ్య చిచ్చు పెడుతూ, అభివృద్ధిని పూర్తిగా విస్మరించిందని విమర్శించారు. కేంద్రంలో అధికారంలో ఉంటే ఏం చేసినా చెల్లుబాటు అవుతుందనే మత్తులో రాష్ట్రాలను చిన్నాభిన్నం చేస్తోందని, ఆ పార్టీకి కనువిప్పు కలిగించాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని చెప్పారు.

హామీలు ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నాం..

ప్రజలకు ఇచ్చిన హామీలు ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నామని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. మండలంలోని బచ్చోడు, రాజారం, సోలీపురం, కాకరవాయి గ్రామాల్లో నిర్మిస్తున్న బీటీ రోడ్డు పనులకు ఆదివారం ఆయన శంకుస్థాపన చేశారు. సోలీపురంలో హజ్రత్‌ మన్సూర్‌ షావలి దర్గాను దర్శించి చాదర్‌ సమర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. 200 యూనిట్ల వరకు పేదలకు ఉచిత గృహ విద్యుత్‌, రూ. 500కే గ్యాస్‌ సిలిండర్‌, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, గురుకులాల్లో డైట్‌, కాస్మోటిక్‌ చార్జీల పెంపు వంటి అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నామని వివరించారు. గత ప్రభుత్వం రైతులకు పెట్టుబడి సాయంగా ఎకరాకు రూ.10వేలు ఇస్తే తమ ప్రభుత్వం రూ.12 వేలకు పెంచిందన్నారు. వారం రోజుల్లో రైతు భరోసా నిధులు రైతుల ఖాతాల్లో జమవుతాయని చెప్పారు. ఆయా కార్యక్రమాల్లో పంచాయతీరాజ్‌ ఎస్‌ఈ వెంకటరెడ్డి, ఈఈ మహేష్‌, డీఈ వేణుగోపాల్‌, ఎస్పీడీసీఎల్‌ ఎస్‌ఈ ఇనుగుర్తి శ్రీనివాసాచారి, ఖమ్మం ఆర్డీఓ నరసింహారావు, ఏడీఏ సరిత, ఏఓ సీతారాంరెడ్డి, ఎంపీడీఓ సిలార్‌ సాహెబ్‌, తహసీల్దార్‌ విల్సన్‌, డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్‌, నాయకులు స్వర్ణకుమారి, తుంబూరు దయాకర్‌రెడ్డి, మద్ది శ్రీనివాసరెడ్డి, బెల్లం శ్రీనివాస్‌, అరవిందరెడ్డి, నరేష్‌రెడ్డి, చావా శివరామకృష్ణ, బుద్దా కనకయ్య, అశోక్‌, మంగీలాల్‌ తదితరులు పాల్గొన్నారు.

రైతు భరోసాకు రంగం సిద్ధం

- జిల్లాలో పాత పట్టాదారులు 3,38,463 మంది
- కొత్తగా మరో 4,693 మంది అర్హులు
- నూతన పట్టాదారుల దరఖాస్తుకు 20 వరకు గడువు



ఖమ్మంవ్యవసాయం: వానాకాలం వ్యవసాయ పెట్టుబడి సాయం అందించేందుకు ప్రభుత్వం కార్యాచరణ రూపొందించింది. ఈ సీజన్‌కు అందించే రైతు భరోసాపై ఇప్పటికే జిల్లాలో అర్హుల వివరాలను సేకరించింది. ఈ పథకానికి జిల్లాలో ఇప్పటికే 3,38,463 మంది రైతులు ఉండగా, ఈనెల 5వ తేదీ వరకు పట్టాదారు పాస్‌ పుస్తకాలు పొందిన వారికీ అవకాశం కల్పించింది. దీంతో కొత్తగా మరో 4,693 మంది రైతులు సాయం పొందనున్నారు. మొత్తంగా 3,43,156 మందికి ఈ వానాకాలంలో రైతు భరోసా కింద ఎకరాకు రూ.6 వేల చొప్పున రూ.350 కోట్ల మేర అందించనున్నారు.

20 వరకు దరఖాస్తుకు అవకాశం..

ఈనెల 5వ తేదీ వరకు పట్టాదారు పాసు పుస్తకాలు పొందిన రైతులు పెట్టుబడి సాయం కోసం దరఖాస్తు చేసుకునేందుకు ఈనెల 20 వరకు అవకాశం ఉంది. భూ భారతి ద్వారా పొందిన పట్టాదారు పాస్‌ పుస్తకం లేదా డిజిటల్‌ సంతకం(భూ పరిపాలన ప్రధాన కమిషనర్‌ నుంచి) జిరాక్స్‌ కాపీ, ఆధార్‌ కార్డు జిరాక్స్‌, బ్యాంకు పాస్‌బుక్‌ జతచేసి క్లస్టర్‌ వ్యవసాయ విస్తరణాధికారులకు దరఖాస్తులు అందించాలి. గతంలో రైతుబంధు పొందిన వారు కొత్తగా దరఖాస్తు చేయాల్సిన అవసరం లేదు.

నేడు రైతులతో సీఎం ముఖాముఖి

ప్రస్తుత వానాకాలం సీజన్‌కు అమలు చేసే రైతు భరోసాతో పాటు పలు అంశాలపై సోమవారం సాయంత్రం 4 గంటలకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రైతు నేస్తం వీడియో కాన్ఫరెన్స్‌ కేంద్రాల్లో ముఖాముఖి కార్యక్రమంలో మాట్లాడుతారు. జిల్లాలోని 21 మండలాల్లో 129 క్లస్టర్లు ఉండగా వీసీకి 62 రైతు వేదికలను అందుబాటులోకి తీసుకొచ్చారు. సీఎం రేవంత్‌రెడ్డి సందేశాన్ని వీక్షించేందుకు ఒక్కో వేదికలో 200 మంది రైతులు పాల్గొనేలా ఏర్పాట్లు చేస్తున్నారు.

పెండింగ్‌ భరోసా సంగతేంటి..?

ప్రభుత్వం వానాకాలం సీజన్‌కు రైతు భరోసా అమలు చేస్తున్న క్రమంలో గత యాసంగి సీజన్‌లో నిలిపేసిన బకాయిల సంగతేంటనే ప్రశ్న ఉత్పన్నమవుతోంది. కాంగ్రెస్‌ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గత జనవరి 26న ఈ పథకాన్ని ప్రారంభించింది. అప్పుడు జిల్లాలో 3,51,592 మంది రైతులు ఈ పథకానికి అర్హులుగా ప్రకటించారు. అయితే వారిలో నాలుగైదు విడతలుగా మార్చి నాటికి 2,65,392 మంది రైతుల ఖాతాల్లో రూ. 215.98 కోట్లు జమ చేశారు. ఇంకా 86 వేల మంది రైతులకు రూ.156 కోట్లు జమ చేయాల్సి ఉంది. అయితే ఈ సీజన్‌లో అందించే పెట్టుబడి సాయంతో కలిపి పాతవి కూడా చెల్లించాలని ఆయా రైతులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. గత బీఆర్‌ఎస్‌ ప్రభుత్వం వానాకాలం, యాసంగి సీజన్లకు వేర్వేరుగా ఎకరాకు రూ.5 వేల చొప్పున అందించింది. కాంగ్రెస్‌ అధికారంలోకి వచ్చి ఏడాది గడవగా, ప్రస్తుతం మూడో సీజన్‌ ప్రారంభమైంది. గత ఎన్నికల సమయంలో ఏడాదికి ఎకరాకు రూ.15 వేల పెట్టుబడి సాయం అందిస్తామని హామీ ఇచ్చినా.. ఇప్పుడు ఎకరాకు రూ.6 వేల చొప్పున రెండు సీజన్లకు కలిపి రూ.12 వేలే, అందులోనూ కొందరు రైతులకే అందించడం పట్ల సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది.

'స్వయం' ఉపాధి



ఎస్‌హెచ్‌జీ సభ్యులు కుట్టిన యూనిఫామ్‌ను పరిశీలిస్తున్న మెప్మా అధికారులు

- ఎస్‌హెచ్‌జీలకు యూనిఫామ్‌ తయారీ బాధ్యతలు
- జిల్లాలో 72,432 యూనిఫామ్‌లు కుట్టిన సభ్యులు
- సకాలంలో పాఠశాలలకు అందజేత
- మహిళల్లో పెరిగిన ఆత్మనిర్భరత..

ఖమ్మంమయూరిసెంటర్‌ : జిల్లాలో మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులు (ఎస్‌హెచ్‌జీ) సాధిస్తున్న విజయం ఆత్మనిర్భరతకు, సాధికారతకు ప్రతీకగా నిలుస్తోంది. వృత్తిపరమైన వ్యాపారాలు చేయడంతో పాటు స్వయం ఉపాధి పొందేందుకు గల వనరులను వినియోగించుకుంటూ మహిళలు ఆదర్శంగా నిలుస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ప్రభుత్వం అందించే యూనిఫామ్‌ను మహిళా సంఘాల సభ్యులు కుట్టి ఉపాధి సాధించారు. జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ, మెప్మా ఆధ్వర్యంలో మహిళలకు ఈ క్లాత్‌, కొలతలను అందించగా యూనిఫామ్‌ తయారుచేసి విద్యాశాఖకు అందజేశారు. మొదటి దశలో డీఆర్‌డీఏ, మెప్మా ఆధ్వర్యంలో మహిళలు 72,432 యూనిఫామ్‌లు కుట్టగా.. రెండో దశకు సంబంధించిన ఆర్డర్‌ త్వరలోనే విద్యాశాఖ నుంచి రానున్నట్లు తెలిసింది.

సకాలంలో అందజేత..

ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు ప్రభుత్వం ఉచితంగా యూనిఫామ్‌ అందజేస్తోంది. వీటిని కుట్టే బాధ్యతను ప్రైవేటు కంపెనీలకు ఇవ్వకుండా.. మహిళా సంఘాల సభ్యులకు అప్పగించారు. వేసవిలో యూనిఫామ్‌ వస్త్రాలను జిల్లా అధికారులు మహిళా సంఘాల సభ్యులకు అందజేయగా.. వారు ఇచ్చిన కొలతల ప్రకారం కుట్టారు. డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో 20 మండలాల్లో 77 కేంద్రాలు ఏర్పాటు చేసి 56,614 యూనిఫామ్‌లు తయారు చేయాలని లక్ష్యంగా నిర్దేశించగా ఆయ కేంద్రాల్లో 583 మంది మహిళలు ఉపాధి పొందారు. మెప్మా ఆధ్వర్యంలో ఖమ్మం మున్సిపల్‌ కార్పొరేషన్‌, సత్తుపల్లి, వైరా, మధిర మున్సిపాలిటీల్లో కేంద్రాలను ఏర్పాటు చేయగా 108 మంది మహిళలు 15,818 యూనిఫామ్‌లను తయారు చేశారు. మొదటి దశలో విద్యాశాఖ నుంచి వచ్చిన ఆర్డర్ల ప్రకారం యూనిఫామ్‌ కుట్టి పాఠశాలల పునఃప్రారంభం నాటికి అందజేసి ఉన్నతాధికారుల మన్ననలు పొందారు. ఇలా కుట్టిన మహిళలకు ఒక్కో యూనిఫామ్‌కు రూ.75 చొప్పున చెల్లించనున్నారు. నెల రోజుల్లో ఈ వేతనం వారికి అందనుందని అధికారులు వెల్లడించారు.

నాలుగు నెలల పాటు ఉపాధి..



పాఠశాల విద్యార్థులకు యూనిఫామ్‌ కుట్టడంతో ఉపాధి లభిస్తోంది. సంవత్సరంలో నాలుగు నెలల పాటు ఉపాధి దొరుకుతుంది. యూనిఫామ్‌ తయారీతో నెలకు రూ.12 వేల వరకు సంపాదిస్తున్నా. టైలరింగ్‌ నేర్చుకున్నందుకు మంచి ఉపాధి అవకాశాలు వస్తున్నాయి. ఈ ఆదాయం కుటుంబ అవసరాలకు ఉపయోగపడుతుంది.

– ఎస్‌.మాధవి, కృష్ణవేణి గ్రూప్‌ సభ్యురాలు, ఖమ్మం

ఆనందంగా ఉంది..



టైలరింగ్‌ నేర్చుకున్న తర్వాత స్కూల్‌ యూనిఫామ్స్‌ కుట్టడం ఆనందంగా ఉంది. మహిళా సభ్యులకు యూనిఫామ్‌ కుట్టే బాధ్యతలు ఇచ్చి ప్రభుత్వం మాకు మంచి ఉపాధి చూపించింది. మాకిచ్చిన లక్ష్యాలను సకాలంలో పూర్తి చేశాం. యూనిఫామ్‌ తయారీ ద్వారా వచ్చే వేతనంతో కుటుంబ ఆర్థిక పరిస్థితి మెరుగుపర్చుకోవచ్చు.

– ఎస్‌కె.ఫర్హానా, మదర్‌థెరిస్సా గ్రూప్‌ సభ్యురాలు, ఖమ్మం

ఆత్మవిశ్వాసం పెంపొందించుకునేలా..

జిల్లాలోని మహిళా సంఘాల సభ్యులు నైపుణ్యాన్ని, కష్టపడే తత్వాన్ని చాటుతూ యూనిఫామ్‌ తయారీ బాధ్యతను విజయవంతంగా పూర్తి చేశారు. డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో 56,614, మెప్మా ఆధ్వర్యంలో 15,818 యూనిఫామ్‌లను కుట్టారు. తద్వారా మహిళా సంఘాల సభ్యులు ఆర్థికంగా లబ్ధి పొందడమే కాక, నైపుణ్యాలను మెరుగుపర్చుకున్నారు. సామూహిక కృషి, పరస్పర సహకారంతో వారు ఈ పనిని విజయవంతం చేశారు.

ప్రజలకు దూరంగానే కాంగ్రెస్‌ పాలన

- బీజేపీ వైఖరిపై దేశ వ్యాప్తంగా ఆందోళనలు చేస్తాం
- మాస్‌లైన్‌ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పోటు రంగారావు



మాట్లాడుతున్న పోటు రంగారావు. పక్కన గుమ్మడి నర్సయ్య తదితరులు

ఖమ్మంమయూరిసెంటర్‌ : అనేక హామీలతో రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్‌ ప్రభుత్వ ఏడాదిన్నర పాలన కమీషన్ల మయంగా మారిందని, ఏ సంక్షేమ పథకాన్నీ పూర్తి స్థాయిలో అమలు చేయడం లేదని సీపీఐ(ఎంఎల్‌) మాస్‌లైన్‌ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పోటు రంగారావు విమర్శించారు. ఆదివారం ఖమ్మంలోని రామనర్సయ్య విజ్ఞాన కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. అరకొరగా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని, సీఎం రేవంత్‌రెడ్డి పాలనపై పట్టు సాధించలేకపోయారని అన్నారు. మూడు రోజులుగా ఖమ్మంలో జరిగిన పార్టీ రాష్ట్ర కమిటీ సమావేశాల్లో రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ అంశాలపై చర్చించామన్నారు. ఇరాన్‌పై ఇజ్రాయిల్‌ చేస్తున్న దాడుల వెనుక అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌ పాత్ర ఉందని ఆరోపించారు. పశ్చిమాసియా దేశాలపై పెత్తనం కోసం ఇజ్రాయిల్‌ను అమెరికా పావుగా వాడుకుంటోందని, ఇజ్రాయిల్‌ దాడులను ఖండిస్తూ ఈనెల 19న రాష్ట్ర వ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. దివంగత రాయల చంద్రశేఖర్‌ ప్రథమ వర్ధంతిని సోమవారం ఇల్లెందులో ఏర్పాటుచేశామని, ఈ సందర్భంగా స్తూపం, పుస్తకా విష్కరణ కార్యక్రమాలు ఉంటాయని చెప్పారు. కార్పొరేట్‌ శక్తులను విమానయానరంగంలోకి ప్రోత్సహించడం, కనీస భద్రతా ప్రమాణాలు పరిశీలించకపోవడం వల్లే ఎయిర్‌ ఇండియా విమానానికి అహ్మదాబాద్‌లో ప్రమాదం జరిగిందని ఆరోపించారు. ఇందుకు బాధ్యత వహిస్తూ కేంద్ర విమానయాన శాఖ మంత్రి రాజీనామా చేయాలన్నారు. సమావేశంలో రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కేజీ రామచందర్‌, కె.రమ, కెచ్చెల రంగయ్య, మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య, పార్టీ జిల్లా కార్యదర్శి గోకినేపల్లి వెంకటేశ్వరావు, గుర్రం అచ్చయ్య, సీవై పుల్లయ్య, జి.రామయ్య, ఆవుల అశోక్‌ పాల్గొన్నారు.

క్లుప్తంగా

రోడ్డుపై గుంతలు పూడ్చిన రైతులు



గుంతలు పూడ్చుతున్న రైతులు

ఖమ్మంఅర్బన్: చెరువుకట్టపై ఏర్పడిన గుంతలను రైతులే పూడ్చుకున్న ఘటన మండలంలో ఆదివారం చోటుచేసుకుంది. ఖమ్మం నగరంలోని 15వ డివిజన్ కొత్తగూడెంలోని ధంసలాపురం చెరువుకట్టపై గుంతలు ఏర్పడ్డాయి. ఎవరూ పట్టించుకోకపోవడంతో రైతులే స్వచ్ఛందంగా ముందుకు వచ్చి పూడ్చుకున్నారు. మాజీ కార్పొరేటర్ చేతుల నాగేశ్వరరావు, మొర్రిమేకల కోటయ్యయాదవ్, వాకధాని గురవయ్య, జంగాల నాగేశ్వరరావు, కాంపాటి హనుమంతరావు, తెల్లబోయిన వెంకటేశ్వర్లు, చేతుల రామారావు, చెవుల రమణయ్య, కంచర్ల వీరయ్య, జంగాల వలరాజు, వాకధాని వలరాజు తదితరులు పాల్గొన్నారు.

నేత్రపర్వంగా రామయ్య కల్యాణం



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకుడు

భద్రాచలం: భద్రాచలం శ్రీసీతారామచంద్ర స్వామివారి నిత్యకల్యాణ వేడుక ఆదివారం నేత్ర పర్వంగా సాగింది. తెల్లవారుజామున గర్భగుడిలో సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన, తదితర పూజలు చేశారు. అనంతరం స్వామివారిని మేళతాళాల నడుమ గర్భగుడి నుంచి ఊరేగింపుగా తీసుకొచ్చి బేడా మండపంలో కొలువుదీర్చారు. విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం అనంతరం కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా జరిపారు. వేసవి సెలవుల చివరి ఆదివారం కావడంతో నిత్యకల్యాణ వేడుకలోనూ భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

శ్రీ కనకదుర్గ అమ్మవారికి విశేష పూజలు



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

పాల్వంచరూరల్: పెద్దమ్మతల్లి అమ్మవారికి అర్చకులు విశేష పూజలు నిర్వహించారు. మండలంలోని శ్రీకనకదుర్గ (పెద్దమ్మతల్లి) ఆలయానికి ఆదివారం పలు ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. దీంతో ఆలయ ప్రాంగణం, పరిసరాల్లో సందడి నెలకొంది. అర్చకులు అమ్మవారికి విశేష పూజలు నిర్వహించగా, క్యూలైన్ ద్వారా భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. అన్నప్రాసనలు, ఒడిబియ్యం, పసుపు కుంకుమలు, చీరలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమాల్లో ఈఓ ఎన్.రజనీకుమారి, వేద పండితులు పద్మనాభశర్మ, అర్చకుడు రవికుమార్‌శర్మ పాల్గొన్నారు.

విత్తనాలు సిద్ధం..

అందుబాటులోకి వరి, అపరాల సీడ్స్

- వరిలో జీపీటీ, కేఎస్ఎం సన్న రకాలు
- అపరాలలో పెసర, మినుములు రెడీ



పెసల విత్తన బ్యాగులు



ఖమ్మం విత్తనాభివృద్ధి సంస్థలో నిల్వ ఉన్న వరి విత్తనాలు

ఖమ్మంవ్యవసాయం: రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ ఉమ్మడి ఖమ్మం జిల్లా యూనిట్ వరి, అపరాల విత్తనాలను అందుబాటులోకి తెచ్చింది. వానాకాలం సీజన్ ప్రారంభం కావటంతో తొలుత మెట్ట పంటలు, ఇదే క్రమంలో వరి సాగుకు అవసరమైన విత్తనాలను సంస్థ సిద్ధం చేసింది. ప్రభుత్వం వరిలో విదేశీ డిమాండ్ ఉన్న సన్న రకాలను ప్రోత్సహిస్తోంది. అంతేగాక సన్న రకాలకు కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరతో పాటు రాష్ట్ర ప్రభుత్వం క్వింటాల్‌కు రూ.500 బోనస్ కూడా ఇస్తోంది. దీంతో రైతులు కూడా వరి సాగులో సన్న రకాలకు మొగ్గు చూపుతున్నారు. ఇందుకు అనుగుణంగా రాష్ట్రవిత్తనాభివృద్ధి సంస్థ జిల్లాల వారీగా నీటి వనరులు, నేలల రకాలు, వ్యవసాయ శాఖల ఇండెంట్ల ఆధా రంగా వరిలో సన్న రకాలను అందుబాటులో ఉంచేందుకు కృషి చేస్తోంది. ఉమ్మడి ఖమ్మం జిల్లాకు బీపీటీ 5204 రకంతో పాటు కేఎస్ఎం 1638 రకాన్ని సిద్ధం చేశారు. ఇక మెట్ట పంటలుగా సాగు చేసే పెసర, మినుము విత్తనాలను కూడా సంస్థ అందుబాటులో ఉంచింది. విత్తనాలను ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలు(పీఏసీఎస్), ఆగ్రో రైతు సేవా కేంద్రాల ద్వారా విక్రయించేందుకు ఏర్పాట్లు చేశారు.

షరతులతో కూడిన రాయితీ

వరి విత్తనాలకు విత్తనాభివృద్ధి సంస్థ ఓ ఆఫర్ ప్రకటించింది. ఖమ్మం విత్తనాభివృద్ధి సంస్థ యూనిట్ కార్యాలయం (గోదాం) నుంచి రైతులు నేరుగా విత్తనాలను కొనుగోలు చేస్తే వారికి విత్తన ధరలో 6 శాతం రాయితీ ప్రకటించింది. అంతేగాక రైతులు సమూహంగా ఏర్పడి 2 టన్నుల విత్తనాలను ఆర్డర్ చేస్తే దానికి కూడా 6 శాతం డిస్కౌంట్ కల్పించారు. ఎలాంటి రవాణా చార్జీలు లేకుండా ఆయా గ్రామాలకు సంస్థ విత్తనాలను రవాణా చేసే సౌకర్యం కల్పించింది.

రైతులకు అందుబాటులో..

ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో వరిలో బీపీటీ 5204, కేఎస్ఎం 1638 సన్న రకాల విత్తనాలను విత్తనాభివృద్ధి సంస్థ అందుబాటులోకి తీసుకొచ్చింది. ఇప్పటికే ఖమ్మం జిల్లాలోని విత్తన విక్రయ కేంద్రాల్లో బీపీటీ 5204 రకం 2,943 క్వింటాళ్లు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 807 క్వింటాళ్లు అందుబాటులో ఉన్నాయి. కేఎస్ఎం 1638 రకం ఖమ్మం జిల్లాలోని విక్రయ కేంద్రాల్లో 187 క్వింటాళ్లు అందుబాటులో ఉంచారు. ఖమ్మం జిల్లాలో పెసలు ఎంజీజీ 295 రకం 10 క్వింటాళ్లు, ఎంజీజీ 385 రకం 130 క్వింటాళ్లు, మినుములు బీజీ పీయూ–31 రకం 35 క్వింటాళ్లు అందుబాటులో ఉంచారు. ఇవిగాక ఖమ్మం విత్తనాభివృద్ధి సంస్థ యూనిట్‌లో బీపీటీ 5204 రకం వెయ్యి క్వింటాళ్లు, కేఎస్ఎం 1638 రకం 180 క్వింటాళ్లు సిద్ధంగా ఉన్నాయి.

విత్తన ధరలు (రూ.లలో)

వరి	కిలోలు	రైతు ధర
జీపీటీ 5204	25	950.00
కేఎస్ఎం 1638	25	950.00
పెసలు ఎంజీజీ-295	4	506.00
పెసలు ఎంజీజీ-385	4	506.00
మినుములు పీయూ-31	4	463.00

డిమాండ్ ఆధారంగా విత్తనాలు



వానలు కురుస్తున్న వేళ విత్తన సీజన్ ప్రారంభమైంది. రైతులు సాగు చేసే పంటల ఆధారంగా విత్తనాలను అందుబాటులో ఉంచుతున్నాం. ప్రస్తుతం వరిలో రెండు సన్న రకాల విత్తనాలు, పెసరలో రెండు రకాలు, ఇనుములో ఒక రకం విత్తనాలు అందుబాటులో ఉన్నాయి. ఇప్పటికే పలు ప్రాంతాల్లో రైతులకు విత్తనాలను అందుబాటులో ఉంచాం. రైతుల వినియోగాన్ని బట్టి అందుబాటులో ఉంచుతాం. రైతుల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని షరుతుల ఆధారంగా వరి విత్తనాలకు డిస్కౌంట్ ఇస్తున్నాం. అంతేగాక విత్తన విక్రయాలకు డీలర్ల నుంచి దరఖాస్తులను కూడా ఆహ్వానిస్తున్నాం. వివరాలకు విత్తనాభివృద్ధి సంస్థ కార్యాలయంలో సంప్రదించవచ్చు.

–ఎస్.భిక్షం, ప్రాంతీయ మేనేజర్, విత్తనాభివృద్ధి సంస్థ

రైతువేదికల్లో వీసీ యూనిట్ల ఏర్పాటు



రఘునాథపాలెం: వీసీ యూనిట్‌ను పరిశీలిస్తున్న డీఏఓ పుల్లయ్య

నేలకొండపల్లి: రాష్ట్ర ప్రభుత్వం మూడో విడత రైతు నేస్తం వీసీ (వీడియో కాన్ఫరెన్స్) యూనిట్లను సోమవారం ప్రారంభించనున్నారు. జిల్లాలో 41 రైతు వేదికల్లో కొత్తగా ఏర్పాటు చేశారు. జిల్లావ్యాప్తంగా 129 రైతు వేదికలు ఉండగా.. వాటిలో గతంలో 1, 2 విడతల్లో 21 రైతు వేదికల్లో వీసీ యూనిట్లను ఏర్పాటు చేసి రైతు నేస్తం కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. రైతులకు మరింత చేరువగా ఉండేందుకు ప్రతీ మండలంలో కనీసం మూడు రైతు వేదికల్లో వీసీ యూనిట్లను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం భావించింది. ఈ మేరకు జిల్లాలో మూడో విడతలో 41 వేదికల్లో వీసీ యూనిట్లకు సంబంధించి పరికరాలు ఇన్‌స్టాల్ చేసి, ట్రయల్ రన్ నిర్వహించారు. సోమవారం సీఎం రేవంత్‌రెడ్డి రాష్ట్రవ్యాప్తంగా వీటిని ప్రారంభించనున్నారు. సీఎం జిల్లాలోని నేలకొండపల్లి, కొణిజర్ల మండలంలోని లింగగూడెం రైతు వేదికలో పాల్గొననున్న రైతులతో ముఖాముఖి మాట్లాడేందుకు జిల్లా వ్యవసాయాధికారులు ఏర్పాట్లు చేశారు. ముఖాముఖికి సాంకేతిక సమస్యలు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలని డీఏఓ పుల్లయ్య అధికారులకు సూచించారు. సుర్దేపల్లి, ముజ్జుగూడెం రైతు వేదికల్లో పనులను ఏఓ రాధ పరిశీలించారు.

వీవీపాలెం రైతువేదిక సందర్శన

రఘునాథపాలెం: రైతులకు శాస్త్రీయ సాగు పద్ధతులపై అవగాహన కల్పించేందుకు వ్యవసాయ శాఖ కీలక ముందడుగు వేసిందని డీఏఓ ధనసరి పుల్లయ్య పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని వీవీపాలెం రైతువేదికను సందర్శించి వీడియో కాన్ఫరెన్స్ పనితీరును పరిశీలించారు. ఇప్పటికే జిల్లాలో 21 వీసీ యూనిట్లు ఉండగా.. తాజాగా ఏర్పాటు చేస్తున్న 41 యూనిట్లతో కలిపి మొత్తం 62 అందుబాటులోకి రానున్నాయని వివరించారు. ప్రతి మంగళవారం 'రైతు నేస్తం' కార్యక్రమం నిర్వహించి శాస్త్రవేత్తలు, వ్యవసాయ నిపుణులు ప్రత్యక్షంగా సలహాలు, సూచనలు ఇస్తారని చెప్పారు. కార్యక్రమంలో ఏఓ ఉమామహేశ్వరరెడ్డి, ఏఈఓ సాయిశిరణ్మయి తదితరులు పాల్గొన్నారు.

అలరించిన 'అనశ్వరం'



'అనశ్వరం'నాటికలో సన్నివేశం

ఖమ్మంగాంధీచౌక్: నెల నెలా వెన్నెల కార్యక్రమంలో భాగంగా ఆదివారం రాత్రి ఖమ్మం నగరంలోని భక్త రామదాసు కళాక్షేత్రంలో విజయవాడలోని శ్రీ కృష్ణ తెలుగు థియేటర్ ఆర్ట్స్‌కు చెందిన కళాకారులు ప్రదర్శించిన 'అనశ్వరం'నాటిక ప్రేక్షకులను ఆకట్టుకుంది. సమాజ మార్పు అంశంగా బర్రె సత్యనారాయణ రచించిన ఈ నాటికకు ద్వాదశి వెంకటచంద్రశేఖర్ దర్శకత్వం వహించారు. వైద్య వృత్తితో వ్యాధులు నయం చేయటమే గాకుండా సమాజంలో ఆత్మహత్యలు జరగకుండా చైతన్యం కలిగించేందుకు కూడా తమ వృత్తి ఉండాలని వైద్యుల తపనపై, అనాగరికులను నాగరికులుగా మార్చటం, అనాథలకు అండగా నిలిచి, వారి అభ్యున్నతికి పాల్పడటం లక్ష్యంగా రూపొందించిన నాటిక ప్రేక్షకులను ఆలోచింపజేసింది. ఈ సందర్భంగా జరిగిన సభలో కార్పొరేటర్ కమర్తపు మురళి, కార్యక్రమ అతిథి బత్తినేని నీరజ మాట్లాడుతూ.. ఎక్కడా లేని విధంగా ఖమ్మంలో నెలనెలా వెన్నెల పేరిట నాటికలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించటం అభినందనీయమన్నారు. నిర్వాహకులు ఎన్నో వ్యయప్రయాసాలకు ఓర్చి ప్రతి నెలా కార్యక్రమాన్ని నిర్వహించటం ఆదర్శనీయమన్నారు. కార్యక్రమంలో అమరజీవి అనాబత్తుల రవీంద్రనాథ్ సాంస్కృతిక కళా సంస్థ(ఆర్క్స్) కార్యదర్శి అన్నాబత్తుల సుబ్రహ్మణ్యకుమార్, ఖమ్మం కళా పరిషత్ అధ్యక్షులు డాక్టర్ నాగబత్తిని రవి, ప్రజా నాట్యమండలి కార్యదర్శి వేముల సదానందం, నందిగామ కృష్ణ, రవీందర్ తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమంలో భాగంగా గాయకులు మంజుల నాయుడు, గణపతి రాజు, భిక్షం తదితరులు సినీ గీతాలను ఆలపించి ప్రేక్షకులను అలరించారు. ఫాదర్స్ డే సందర్భంగా నాన్న ఔన్నత్యం తెలిపే పాటలు పాడారు.

టీజీఎస్ఆర్టీసీ ఈయూ నూతన కమిటీ ఎన్నిక



మాట్లాడుతున్న పాటి అప్పారావు

ఖమ్మంమామిళ్లగూడెం: టీజీఎస్ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్ ఖమ్మం రీజియన్ కౌన్సిల్ సమావేశం ఆదివారం గిరిప్రసాద్‌భవన్‌లో రీజియన్ అధ్యక్షుడు గుడిబోయిన శ్రీనివాస్ అధ్యక్షతన జరిగినది. సమావేశంలో టీజీఎస్ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్ ఖమ్మం రీజియన్ అధ్యక్షుడిగా బూదాటి శ్రీనివాసరెడ్డి, రీజియన్ కార్యదర్శిగా పిల్లి రమేశ్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా గుడిబోయిన శ్రీనివాసరావును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఈయూ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి పాటి అప్పారావు మాట్లాడారు. ఈ నెల 24న అన్ని సంఘాలతో సమావేశం హైదరాబాదులో ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం బీజీ క్లైమేట్, బాగం హేమంతరావు మాట్లాడారు. కందుల భాస్కర్‌రావు, తిమ్మినేని రామారావు, అరుణకుమారి, తిమ్మినేని రామారావు, రామచంద్రరావు, దేశబోయిన జగన్నాథం, బేతంపూడి బుచ్చిబాబు, జి.ఎస్.రెడ్డి, వెంకన్న, రమేశ్, అరుణమ్మ, కవిత, జరీనాబేగం, లాల్బి తదితరులు పాల్గొన్నారు.

తండ్రికి కుమార్తె తలకొరివి



తండ్రికి తలకొరివి పెడుతున్న కుమార్తె

దమ్మపేట: తండ్రికి కుమార్తె తలకొరివి పెట్టి అంత్యక్రియలు నిర్వహించిన ఘటన ఆదివారం మండలంలో చోటుచేసుకుంది. మండలంలోని నాగుపల్లి గ్రామానికి చెందిన కునుసోతు రామకృష్ణకు మూడు రోజుల కిందట బ్రెయిన్ స్ట్రోక్ రాగా ఖమ్మం ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఆదివారం పరిస్థితి విషమించి మృతిచెందాడు. మృతుడికి కుమారులు లేకపోవడంతో బీటెక్ చదువుతున్న ఆయన పెద్ద కుమార్తె శ్రావిక తలకొరివి పెట్టాల్సి వచ్చింది. ఫాదర్స్‌డే రోజే తండ్రికి కుమార్తె అంత్యక్రియలు చేయాల్సిరావడంతో గ్రామంలో విషాదం అలుముకుంది.

హక్కుల సాధనకు పోరాటం



అభివాదం చేస్తున్న ఎల్‌హెచ్‌పీఎస్, సంగారభేరి నేతలు

ఖమ్మంమామిళ్లగూడెం: గిరిజన హక్కుల సాధనకు ఢిల్లీ స్థాయిలో లడాయికి సిద్ధం కావాలని లంబాడి హక్కుల పోరాట సమితి – సంగార భేరి జాతీయ వ్యవస్థాపక అధ్యక్షుడు దాస్‌రాంనాయక్ పిలుపునిచ్చారు. ఆదివారం ఖమ్మం ఐఎంఏ హాల్‌లో ఖమ్మం జిల్లా అధ్యక్షులు దశరథ్‌నాయక్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయనతో పాటు రాష్ట్ర అధ్యక్షులు రాజేశ్‌నాయక్, జాతీయ జనరల్ సెక్రెటరీ డాక్టర్ నరేందర్‌పవార్ పాల్గొని మాట్లాడారు. తెలంగాణలో ప్రభుత్వం నిర్వహించిన కులగణనలో లంబాడీల జనాభా బహిర్గతం చేయాలని, గిరిజనులు సాగుచేస్తున్న పోడు, లావణి భూముల సమస్యలు శాశ్వతంగా పరిష్కరించి వెంటనే పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమావేశంలో , రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ప్రకాశ్‌రాథోడ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వాసునాయక్, రాష్ట్ర కార్యదర్శులు గోవింద్‌నాయక్, కృష్ణనాయక్, రాష్ట్ర ఉపాధ్యక్షులు బాలునాయక్, పంతులునాయక్, రాష్ట్ర సీనియర్ నాయకులు అజ్మీర సమ్మయ్య, పలు జిల్లాల అధ్యక్షులు వీరేశ్‌నాయక్, సురేశ్‌నాయక్, రాథోడ్‌సూర్య, సైదానాయక్, నీలకంఠం, జంపానాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఆరు క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత



రేషన్ బియ్యాన్ని సీజ్ చేస్తున్న ఆర్‌ఐ జానీమియా

సత్తుపల్లిటౌన్: పట్టణంలోని ద్వారకాపురి కాలనీలో ఆదివారం ఆటోలో తరలిస్తున్న ఆరు క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని రెవెన్యూ అధికారులు పట్టుకున్నారు. ద్వారకాపురికాలనీ రోడ్-7లో గజ్జల చంద్రకళ నివాసం నుంచి సుమారు 4 క్వింటాళ్ల రేషన్ బియ్యం ఆటోలో వేస్తున్నారు. అదేకాలనీ రోడ్ నంబర్–2లో కొడాలి రమేశ్ ఆటోలో రెండు క్వింటాళ్లు వేస్తున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు దాడి చేసి రెండు చోట్ల బియ్యాన్ని పట్టుకున్నామని ఆర్‌ఐ జానీమియా తెలిపారు. కేసు నమోదు చేసి ఆటో, బియ్యాన్ని సీజ్ చేసినట్లు ఆర్‌ఐ జానీమియా తెలిపారు.

'నగ్నదేశం' కావ్య సంపుటి ఆవిష్కరణ



'నగ్నదేశం'కవితా సంపుటి పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న కవులు, సాహితీవేత్తలు

ఖమ్మంగాంధీచౌక్: కవి, రచయిత, అనువాదకులు, చిత్రకారుడు సవ్యసాచి రచించిన కవితా సంపుటి 'నగ్నదేశం'పుస్తక ఆవిష్కరణ ఖమ్మం నగరంలోని గట్టయ్య సెంటర్ టెండర్ రూట్స్ పాఠశాలలో ఆదివారం జరిగింది. కార్యక్రమంలో పాల్గొన్న కవి, కేంద్ర సాహిత్య అకాడమీ జరల్ కౌన్సిల్ సభ్యులు ప్రసేన్ మాట్లాడుతూ.. సవ్యసాచి కవిగా, అనువాదకునిగా రాణిస్తున్నారని తెలిపారు. పాత, కొత్త తరం కవులు రాస్తున్న 'సిగ్నేచర్ పోయమ్స్'ను ఆంగ్ల భాషలోకి అనువాదం చేయడానికి పూనుకున్నారన్నారు. జాషువా సాహిత్య వేదిక అధ్యక్షులు, కవి మువ్వా శ్రీనివాసరావు మాట్లాడుతూ.. సవ్యసాచి సామాజిక కోణంలో కవిత్వాన్ని అందించటం అభినందనీయమన్నారు. విద్యావేత్త, కవి రవిమారుత్ మాట్లాడుతూ.. సవ్యసాచి మణిపూర్‌లో జరిగిన మారణహోమంలో స్త్రీని నగ్నంగా నడిబజార్‌లో ఊరేగించిన ఉదంతాన్ని తాను రాసిన కవితా సంపుటి 'నగ్నదేశం'లో వివరించారని తెలిపారు. కార్యక్రమంలో కవులు శ్రీరామకవచం సాగర్, అన్నవరం దేవేందర్, డాక్టర్ పోతగాని తదితరులు సవ్యసాచి రచనను అభినందించారు. కార్యక్రమంలో కవులు ఇబ్రహీం, నిర్గుణ్, సునంద, రాంకుమార్, శేషగిరి, వెంకటయ్య, అమృత వర్షిణి, జయరాజ్, ఆంజనేయులు, పి.వెంకటేశ్వర్లు, దేవ, రౌతు రవి తదితరులు పాల్గొన్నారు.

మున్నేరు పనులు ముందుకు సాగేనా..?

- వరద నియంత్రణకు రిటైనింగ్ వాల్ నిర్మాణం
- ఖమ్మం వైపు భూ సేకరణకు పలువురు ససేమిరా..
- వర్షాకాలం నేపథ్యంలో జాప్యం కానున్న పనులు



ఖమ్మం వైపు నిలిచిపోయిన రిటైనింగ్ వాల్ నిర్మాణం

ఖమ్మం అర్బన్: మున్నేరు నదికి ఇరువైపులా వరదల నుంచి రక్షణ కల్పించేందుకు ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రిటైనింగ్ వాల్ నిర్మాణ పనులు ఖమ్మం నగర పరిధిలో భూసేకరణ సమస్యతో అర్ధంతరంగా నిలిచిపోయే పరిస్థితి ఏర్పడింది. దాదాపు రూ.690 కోట్ల అంచనాతో సుమారు 16 కి.మీ.కు పైగా రిటైనింగ్ వాల్ నిర్మాణం చేపడుతున్నట్టు అధికారులు వెల్లడించారు. ఇందులో ఖమ్మం రూరల్ మండలం వైపు సుమారు రూ. 150 కోట్ల విలువైన పనులు ఇప్పటికే పూర్తి కాగా, ఖమ్మం నగరం వైపు భూసేకరణ సమస్యలతో పనులు నిలిచిపోయాయి. నగర పరిధిలో ఎనిమిది కిలోమీటర్ల రిటైనింగ్ వాల్ నిర్మాణానికి 113.27 ఎకరాల భూమి అవసరం కాగా, ఇందులో 38.18 ఎకరాలు ప్రభుత్వ భూమిగా గుర్తించారు. మిగిలిన 81.08 ఎకరాల్లో ప్రైవేట్ భూములు, ప్లాట్లు ఉన్నాయి.

రైతుల నిరాకరణ..

ప్రభుత్వం 2013 భూసేకరణ చట్టం ప్రకారం భూములు సేకరిస్తుండగా, ఇచ్చే నష్ట పరిహారం సరిపోవడం లేదని కొంతమంది రైతులు, భూమికి బదులు భూమి ఇచ్చి న్యాయం చేయాలని మరికొందరు కోర్టులను ఆశ్రయించారు. అయితే భూసేకరణకు ముందే రైతులను ఒప్పించాలని కోర్టులు ప్రభుత్వానికి సూచించినట్టు సమాచారం.

ప్రాంతాలవారీగా భూసేకరణ ఇలా..

దానవాయిగూడెం పరిధిలో 34 ఎకరాల్లో 22 ఎకరాలు ఎన్నెస్పీ భూములు కాగా, 11 ఎకరాలు ప్రైవేట్ భూములు ఉన్నాయి. ఇందులో ఆరుగురు రైతులు భూమి ఇవ్వడానికి ముందుకొచ్చారు.

- మల్లెమడుగు పరిధిలో 14 ఎకరాల 29 గుంటల భూమి అవసరం కాగా, ఏడుగురు రైతులు ఇంకా ఒప్పుకోలేదు.
- బుర్హాన్‌పురం పరిధిలో 22 ఎకరాల్లో 11 కుంటలు ప్రభుత్వ భూమి ఉంది. మరో 5 ఎకరాలకు చెందిన రైతులు మాత్రమే ఒప్పుకోగా, మిగిలిన రైతులు ఇంకా అంగీకారం తెలపలేదు.
- ఖమ్మం అర్బన్ పరిధిలో 42 ఎకరాల 4 గుంటల భూముల్లో 9 ఎకరాల 18గుంటలు మాత్రమే ప్రభుత్వ భూమి ఉంది. మిగతా 32 ఎకరాల 24 కుంట ల్లో పదెకరాలకు చెందిన రైతులు, కొంతమంది ప్లాట్ల యజమానులు ఇవ్వడానికి ముందుకొచ్చారు.

అంగీకారాలు తక్కువ..

నగర పరిధిలో 288 ప్లాట్లు ప్రాజెక్ట్ నిర్మాణ పరిధిలో ఉండగా ఇప్పటివరకు 45 మంది మాత్రమే భూమి ఇచ్చేందుకు అంగీకారం తెలిపినట్లు అధికారులు చెప్తున్నారు. బుర్హాన్‌పురంలో 51 ప్లాట్లు ప్రభావితమవుతుండగా 12 మంది మాత్రమే అంగీకరించారు. దీంతో పనులు ముందుకు సాగడం కష్టంగా మారింది.

పనులు నిలిపేసే దిశగా..

వర్షాకాలం మొదలవుతున్న నేపథ్యంలో పనులు మరింత ఆలస్యమయ్యే అవకాశం ఉంది. దీంతో తాత్కాలికంగా భూసేకరణ, నిర్మాణ పనులు నిలిపేసేలా అధికారులు యోచిస్తున్నారు. ఇప్పటివరకు ఖమ్మం నగరం వైపు ఒక కిలోమీటర్ పరిధిలో 250 మీటర్లకు పైగా వాల్ నిర్మాణం పూర్తయినట్టు ఇంజనీరింగ్ అధికారులు చెబుతున్నారు. ఒప్పందాలు పూర్తయ్యే వరకు మిగిలిన పనులకు జాప్యం తప్పదని తెలుస్తోంది.

గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి



చల్లా కృష్ణయ్య (ఫైల్)

తల్లాడ: స్థానిక డాంబర్ ప్లాంట్ వద్ద గుర్తు తెలయని వాహనం ఢీకొని వ్యక్తి మృతి చెందిన ఘటన ఆదివారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. తల్లాడకు చెందిన చల్లా కృష్ణయ్య (63) ఉదయం కల్లూరు రోడ్డులో ఉన్న తన పొలం వద్దకు వెళ్లి టీవీఎస్ మోపెడ్‌పై తిరిగి వస్తున్నాడు. డాంబర్ ప్లాంట్ వద్ద గుర్తు తెలియని వాహనం వెనుక నుంచి ఢీకొట్టడంతో కృష్ణయ్య అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య, ముగ్గురు కుమారులు, కుమార్తె ఉన్నారు. కుమారుడు చల్లా నాగులు ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ వెంకటకృష్ణ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

ఫాదర్స్ డే రోజే..

తలకు దెబ్బ తగిలి తీవ్ర రక్త స్రావం కావటంతో కృష్ణయ్యను స్థానికులు గుర్తుపట్టలేక పోయారు. చిన్న కుమారుడు రాము అక్కడికొచ్చి కూడా తన తండ్రి కాదనుకొని వెళ్లిపోయాడు. ఆ తర్వాత రెండో కుమారుడు చల్లా నాగులు అక్కడికొచ్చి తన తండ్రి టీవీఎస్ మోపెడ్‌ను చూసి గుర్తు పట్టాడు. కాగా, ఫాదర్స్ డే రోజే తమను వదిలివెళ్లావా.. అంటూ కుమారులు, కుమార్తె విలపించిన తీరు అక్కడివారిని కలచివేసింది.

రైలు ఢీకొని సుతారి మేస్త్రి మృతి



వెంకటేశ్వర్లు(ఫైల్)

ఖమ్మంక్రైం: రైలు ఢీకొని ఓ సుతారి మేస్త్రీ మృతిచెందిన ఘటన ఆదివారం నగరంలో చోటుచేసుకుంది. ధంసలాపురానికి చెందిన నరం వెంకటేశ్వర్లు అలియాస్ వెంకన్న (75) సుతారి మేస్త్రీగా పనిచేస్తున్నాడు. ఇంటిసమీపంలో ఓ ఫంక్షన్‌కు హాజరై తన సైకిల్‌తో రైలుపట్టాలు దాటుతుండగా అటువైపు నుంచి వచ్చిన రైలు ఢీకొని అక్కడికక్కడే మృతిచెందాడు. ఆయనకు చెవులు సరిగ్గా వినపడకపోవడంతో ప్రమాదం జరిగినట్లు తెలిసింది. మృతుడికి భార్య, నలుగురు కుమార్తెలు ఉండగా ఒకకుమార్తె గతంలో మృతిచెందింది. ఘటనా స్థలాన్ని జీఆర్పీ హెడ్‌కానిస్టేబుల్ సత్యనారాణరెడ్డి చేరుకొని అన్నం ఫౌండేషన్ నిర్వాహకులు అన్నంశ్రీనివాసరావు బృందం సాయంతో మృతదేహాన్ని మార్చురీకి తరలించారు.

రోడ్డు ప్రమాదంలో వైద్యుడికి గాయాలు

టేకులపల్లి: ఇల్లెందుకు చెందిన రమేశ్ సాహు కుమారుడు కార్తీక్ సాహు కొత్తగూడెం ఏరియా ఆస్పత్రిలో వైద్యుడిగా చేస్తున్నాడు. ఆదివారం బైక్‌పై కొత్తగూడెం నుంచి ఇల్లెందుకు వెళ్తుండగా తొమ్మిదోమైలుతండా వద్ద ఎద్దు అడ్డురావడంతో బైక్ అదుపు తప్పి కింద పడ్డాడు. గాయపడిన కార్తీక్‌ను కొత్తగూడెం ఆస్పత్రికి తీసుకెళ్లారు.

యువతి అదృశ్యం

దమ్మపేట: కళాశాలకు వెళ్లిన యువతి కనిపించకుండా పోయిన ఘటన మండలంలోని నాగుపల్లిలో వెలుగులోకి వచ్చింది. గ్రామానికి చెందిన యువతి ఈ నెల 2న కళాశాలకు వెళ్లి ఇంటికి తిరిగిరాలేదు. ఆదివారం యువతి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టామని ఎస్‌ఐ సాయికిశోర్ తెలిపారు.